క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

మొగుళ్లపల్లి: మండలంలోని ముల్కలపల్లిలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని గురువారం ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రారంభించనున్నట్లు ముల్కలపల్లి సర్పంచ్ అన్నారెడ్డి తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రానున్న రోజుల్లో మరిన్ని పథకాలు అందిస్తాం..

భూపాలపల్లి రూరల్: రానున్న రోజుల్లో మరిన్ని పథకాలు దళితులకు అందించే విధంగా ముఖ్యమంత్రితో విన్నవిస్తానని తెలంగాణ షెడ్యూల్డ్ కులాల సహకార కార్పొరేషన్ చైర్మన్ బి.శ్రీనివాస్ అన్నారు. బుధవారం అధికారులతో కలిసి జిల్లాలోని దళితబంధు పథకం ద్వారా లబ్ధిపొందిన దుకాణదారులను. వాహన దారులను, వివిధ షాపులు నడిపిస్తున్న వారిని కలిశారు. పథకం తీరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌తో పథకం అమలుపై చర్చించారు. చైర్మన్ వెంట జిల్లా షెడ్యూల్డు కులాల సేవా సహకార అధికారి వెంకటేశ్వర్‌రావు, కార్యాయం సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణిలో క్రచ్ ఏర్పాటు చేయాలి

భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో మహిళా కార్మికుల కొరకు, చిన్న పిల్లలు ఆడుకునేందుకు క్రచ్ ఏర్పాటు చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ సభ్యురాలు శ్వేత డిమాండ్ చేశారు. సింగరేణిలో మహిళా కార్మికుల సంఖ్య పెరుగుతుందన్నారు. సరిపడా చైల్డ్‌కేర్ లీవులు ఇవ్వకపోవడంతో చిన్న పిల్లలను తీసుకొని విధులకు హాజరుకావడం ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యాజమాన్యం క్రచ్ ఏర్పాటు చేయాలని కోరారు. మహిళల కమిటీలకు ప్రాతినిధ్యం కల్పించి ప్రతి రెండు నెలలకోసారి సమావేశం ఏర్పాటు చేయాలన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరేళ్ల జోసఫ్ అన్నారు. బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ స్వర్ణలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జోసఫ్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు బుక్స్, ఫీజు పేరు మీద ఒక్కో విద్యార్థిపై అదనంగా రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు వసూలు చేస్తున్నారని తెలిపారు. పాఠశాలల్లో కనీస వసతులు లేకున్నా ఇష్టానుసారంగా వివిధ రకాల పేర్ల మీద ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నట్లు ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వైష్ణవి, రాధిక, రవికాంత్, రామకృష్ణలు పాల్గొన్నారు.

‘చలో వరంగల్’కు తరలిరావాలి



కాటారం : జూన్ 4న ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ‘హలో మాదిగ చలో వరంగల్’ మహాసభకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎంఎస్పీ మండల ఇన్‌చార్జ్ చంద్రగిరి అశోక్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత సాధనకై మాదిగలు, మాదిగ ఉపకులాలు ఏకమై పోరాటం ఉధృతం చేయాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ మంతెన చిరంజీవి, మండల నాయకులు మంతెన రాకేశ్, ఆకాశ్, నరేశ్, రమేశ్, శ్రీను, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



భూపాలపల్లి రూరల్: హనుమకొండ జిల్లా మడికొండలోని రెడ్డి కన్వెన్షన్‌లో నిర్వహించ తలపెట్టిన రెడ్ల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని రెడ్డి జేఏసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కామిడి సతీష్ రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సమ్మేళనం వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బిళ్ల రాజిరెడ్డి, సతీష్ రెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి ధాన్యం అక్కడే..

- లారీలు రావు...ధాన్యం పోదు
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు



నైన్‌పాక కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యం బస్తాలు

చిట్యాల: మండలంలోని నైన్‌పాక, జడల్‌పేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడి ధాన్యం అక్కడే నిలువ ఉండడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం మొదలవుతుందని కనీసం పట్టించుకునే నాథుడే లేరన్నారు. చేలలో దుక్కులు దున్నుకునే సమయంలో మాకు ఈ కష్టం ఏంటని రైతులు వాపోతున్నారు. పండించిన పంటను కొనుగోలు కేంద్రాల వద్ద తీసుకొచ్చి రాత్రి, పగలు ఉండాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నైన్‌పాకలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభమై 20 రోజులు అవుతున్నా ఇప్పటి వరకు ఆరు లారీలతో పాటు కొంత మేరకు ట్రాక్టర్లలో మిల్లుకు పంపించినట్లు అక్కడి సిబ్బంది తెలిపారు. మిగతా రైతుల పరిస్థితి ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు.

జడల్‌పేటకు ఒక్క లారీ మాత్రమే వచ్చింది..

జడల్‌పేటలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభమై 20 రోజులు అవుతున్నా ఇప్పటి వరకు సెంటర్ నుంచి ఒక్క లారీలోనే ధాన్యాన్ని మిల్లుకు పంపించినట్లు రైతులు తెలిపారు. మిగతా రైతులు పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. మంగళవారం తెల్లవారుజామున కురిసిన అకాలవర్షం మూలంగా కేంద్రానికి వచ్చి ధాన్యంపై



జడల్‌పేటలో....

కప్పిన కవర్లను చూసేసరికి ధాన్యం కొంతమేరకు తడిసిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ కొనుగోలు సెంటర్ ఏర్పాటు చేయకపోతే బయట అమ్ముకుని మా పనులు చేసుకునే వాళ్లం అని ఆవేదనతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని మండలంలో ఉన్న కొనుగోలు కేంద్రాల్లోని వరి ధాన్యాన్ని తక్షణమే తరలించి రైతులను ఆదుకోవాలని వేడుకున్నారు.

కాంటాలు అయినా తరలించడం లేదు..



కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి ఇరవై రోజులు అయింది. కాంటాలు పెట్టినా కనీసం ధాన్యాన్ని తరలించడం లేదు. ఇక్కడి నుంచి పోయే వరకు రైతులదే బాధ్యత అంటున్నారు. పంటచేను వద్ద వ్యవసాయ పనులు ఆలస్యం అవుతున్నాయి. అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. తొందరగా ధాన్యాన్ని తరలించి రైతులను ఆదుకోవాలి.

- బయగాని రమేష్, రైతు జడల్‌పేట

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం



భూపాలపల్లి అర్బన్ : పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి

గణపురం : భూపాలపల్లి నియోజకవర్గంలోని యువత ఉపాధి లక్ష్యంగా జీఎంఆర్ ట్రస్టు పని చేస్తుందని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సాయంత్రం జీఎంఆర్ఎం ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత డ్రైవింగ్ శిక్షణా కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎంఆర్ ట్రస్టు పేరుతో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే మండల వ్యాప్తంగా ఉచితంగా డ్రైవింగ్ నేర్పించడంతో పాటు లైసెన్స్‌లను ఇప్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, జీఎంఆర్ఎం ట్రస్టు జనరల్ సెక్రటరీ గండ్ర గౌతమ్‌రెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పొలసాని లక్ష్మీనరసింహారావు, గణపురం పీఏసీఎస్ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, సర్పంచ్ నారగాని దేవేందర్ గౌడ్, ఎంపీటీసీ మోటపోతుల శివశంకర్ గౌడ్, ఉపసర్పంచ్ పోతర్ల అశోక్ యాదవ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గుర్రం తిరుపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌కాలనీ ఇళ్లకు పట్టాల పంపిణీ

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాలోని సుభాష్‌కాలనీలోని సింగరేణి కార్మికులకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం బుధవారం చేపట్టారు. స్థానిక రామాలయ ఆవరణంలో తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హాజరై కాలనీవాసులకు పట్టాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సింగరేణి పరిధిలోని స్థలాల్లో ఇళ్లు నిర్మించుకొని జీవిస్తున్న కార్మికులు, కార్మికేతరులకు పూర్తి హక్కులు కల్పించాలని సింగరేణి భూమిని రెవెన్యూకు బదలాయించి జీవో నంబర్ 76 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేశారన్నారు. దళారుల ప్రమేయం లేకుండా రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పాడిన అన్ని జిల్లాల్లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రగతి పథంలో ముందుకు వెళ్తుతుందన్నారు. ఇంకా ఇళ్ల పట్టాలకు దరఖాస్తు చేసుకొని జీఓ నెంబర్ 58 ప్రకారం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



భూపాలపల్లి రూరల్ : ఎలక్ట్రికల్ షాపును ప్రారంభించిన ఎమ్మెల్యే

అధునాతన షాపులు రావాలి

భూపాలపల్లి రూరల్ : అభివృద్ధి చెందుతున్న పట్టణానికి అనుగుణంగా అధునాతన షాపులు రావాలని స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. పట్టణ పరిధిలో మంజూర్ నగర్‌లో నాగవల్లి వినయ్ ప్రవీణ్‌లు నూతనంగా ఏర్పాటు చేసిన నక్షత్ర ఎలక్ట్రికల్ సానిటరీ షాప్‌ను ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెంకటరాణి సిద్దు, కౌన్సిలర్ బద్ది సమ్మయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్, కౌన్సిలర్ గండ్ర హరీష్‌రెడ్డి, బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, గ్రంథాలయ చైర్మన్ బుర్ర రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత

కాటారం: మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక ఆదర్శనగర్‌లో నిర్వహించిన షటిల్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు బుధవారం కాంగ్రెస్ యూత్ నాయకుడు, శ్రీపాద ట్రస్టు చైర్మన్ శ్రీనుబాబు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో బాలు, సాయి, ద్వితీయ స్థానంలో విజయ్, ప్రవీణ్‌లు నిలవగా ఉత్తమ ప్లేయర్‌గా కుమార్ నిలిచారు. విజేతలకు షీల్డులు అందజేసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ పంతకాని సమ్మయ్య, కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, యూత్ డివిజన్ కార్యదర్శి కడారి విక్రమ్, సర్పంచ్ రవికుమార్,



విజేతలకు బహుమతులు అందజేస్తున్న శ్రీనుబాబు, ఎంపీపీ సమ్మయ్య

నాయకులు అశోక్, కొంరయ్య, శ్రావణ్, రాజబాబు, కిరణ్, శ్రీకాంత్, లచ్చిరెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

పరామర్శ



సదువలిని పరామర్శిస్తున్న పుట్ట మధు

మహాముత్తారం : మండల కేంద్రానికి చెందిన మార్క తేజగౌడ్ ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. అతని కుటుంబ సభ్యులను బుధవారం పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్ట మధు పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా నేతకానిపల్లికి చెందిన బౌతు సదువలి అనారోగ్యం బారిన పడటంతో అతనిని పరామర్శించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ మండల రాజిరెడ్డి, ఎంపీటీసీ శ్రీపతి సురేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్వచర్ల రాజు, జేపాల్‌నాయక్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న ఆలయ ప్రతిష్ఠాపన పూజలు

కాటారం: స్థానిక గారెపల్లి భక్తాంజనేయస్వామి ఆలయ పునఃప్రతిష్ఠాపనలో భాగంగా బుధవారం రెండో రోజు ప్రత్యేక పూజలు కొనసాగాయి. శ్రీమహదేవ వేద పాఠశాల వైదిక వేద విద్యా ప్రదాత దుద్దిళ్ల మనోహర అవధాని, ఆలయ పురోహితులు మాడుగుల నాగరాజుశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. బుధవారం నిత్య పూజలు, యోగిని క్షేత్రపాలాది లింగతోభద్ర మండపదేవతా హవనములు, ఏకాశీత కలశస్థాపన నూతన దేవాలయ ప్రాసాద వాస్తు బింబశుద్ధి పంచగవ్యాధివాస క్షీరాధివాసములు, స్థాపిత దేవతమూల మంత్ర హవనములు ధాన్యాధివాస, పుష్పాదివాస, ఫలాధివాస, శయ్యాధివాసములు, హారతిమంత్ర పుష్పములు, చతుర్వేద సేవలు, తీర్థ ప్రసాద వితరణ జరిపించారు. చీమల కనకమ్మ, లచ్చమ్మ జ్ఞాప



పూజలు నిర్వహిస్తున్న పూజారులు, గ్రామస్తులు

కార్థం వారి కుటుంబ సభ్యులు మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి పౌరాణిక కార్యక్రమాలు కొనసాగించారు. కార్యక్రమంలో ఆలయ పునఃనిర్మాణ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి విరాళం



పూజల అనంతరం మాట్లాడుతున్న కీర్తిరెడ్డి

టేకుమట్ల(గోరికొత్తపల్లి): రేగొండ మండలంలోని గోరికొత్తపల్లిలో పోచమ్మతల్లి, పెద్దమ్మతల్లి ఆలయాలను నూతనంగా నిర్మించి పారంభించనున్న సందర్భంగా బుధవారం బీజేపీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులకు రూ.25 వేలను విరాళంగా అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామ దేవతలైన పోచమ్మతల్లి, పెద్దమ్మతల్లి ఆశీస్సులు ప్రతీ ఒక్కరిపై ఉండాలని కోరుకున్నారు. ఆమె వెంట రేగొండ, గూడెపెల్లి సర్పంచ్‌లు ఏడునూతుల నిశీధర్‌రెడ్డి, లింగంపెల్లి ప్రసాద్‌రావు, బీజేపీ మండల అధ్యక్షుడు దాసరి తిరుపతిరెడ్డి, తదితరులు ఉన్నారు.

గ్రామపంచాయతీ సిబ్బందిని క్రమబద్ధీకరించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

ఎస్ఎస్ తాడ్వాయి : గ్రామ పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ జేఏసీ మండల అధ్యక్షుడు బండారి బుజ్జిబాబు, కార్యదర్శి కాంతారావు, ప్రధాన కార్యదర్శి దబ్బగట్ల నారాయణ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండలంలోని గ్రామపంచాయతీలో పనిచేస్తున్న సిబ్బందితో కలిసి ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీపీలో పనిచేస్తున్న సిబ్బంది పీఆర్‌సీలో నిర్ణయించిన కనీస వేతనం చెల్లించాలని కోరారు. గ్రామపంచాయతీ సిబ్బంది వేతనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్ కేటాయించాలన్నారు. జీవో నంబర్ 51ని సవరించి మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది మహేష్, ఆనంద్, సారయ్య, జలంధర్, విజయలక్ష్మి, పాల్గొన్నారు.

అనుమానితులకు ఆశ్రయం కల్పించొద్దు

పలిమెల : అనుమానితులకు ఆశ్రయం కల్పించొద్దని ఎస్సై అరుణ్ అన్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం మండలంలోని ముకునూర్ కొడిశలలో పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు గ్రామంలో ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఎస్సై అరుణ్ గ్రామస్తులతో మాట్లాడుతూ ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే మావోయిస్టులకు సహకరించడం, ఆశ్రయం కల్పించడం చట్టరీత్యా నేరమని, ఇందుకు కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. మావోయిస్టుల గురించి ఎటువంటి సమాచారం తెలిసిన వెంటనే పోలీసు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై అరుణ్

లకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సివిల్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి గేదెలు మృతి

మహదేవపూర్: మండల కేంద్రంలోని గోదావరి సమీపంలో పంట చేలల్లో మేతకు వెళ్లి గాలి దుమారానికి తెగి పడిపోయిన విద్యుత్ తీగలకు తగిలి రెండు పాడిగేదెలు మృతి చెందాయి. మంగళవారం తుంగల సమ్మయ్యకు చెందిన రెండు గేదెలు మేత మేస్తూ వెళ్లాయి. విద్యుత్ తీగలకు సరఫరా కావడంతో గేదెలు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. మృతి చెందిన గేదెల విలువ రూ. 1.50లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి నష్టపరిహారం అందించాలని కోరాడు.

రానున్న రోజుల్లో కాంగ్రెస్‌దే అధికారం

- కాంగ్రెస్ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు

టేకుమట్ల(రేగొండ): దేశంలో, రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ పార్టీయేనని కాంగ్రెస్ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం రేగొండలో పార్టీ జిల్లా, మండల అధ్యక్షుడు అయిత ప్రకాష్‌రెడ్డి, ఇప్పకాయల నర్సయ్య ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వస్తుందని, అందుకు ఇటీవల జరిగిన కర్ణాటక ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీలోకి ఊహించని రీతిలో చేరికలు ఉంటాయని జోస్యం చెప్పారు. రానున్న ఎన్నికలకు ప్రతీ కార్యకర్త సిద్ధంగా ఉండాలని సూచించారు. అనంతరం రెండోసారి పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన అయిత ప్రకాష్‌రెడ్డిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చల్లూరి మధు, శేఖర్, గూటోజు కిష్టయ్య, భువన సుందర్, చంద్రమౌళి పాల్గొన్నారు.

తడిసిన ధాన్యంను కొనుగోలు చేయాలి

అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం రేగొండలో పార్టీ ఆధ్వర్యంలో పర్కాల–భూపాలపల్లి ప్రధాన రోడ్డుపై బైటాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి అప్పులు తెచ్చి పంటలు పండించిన రైతులను ప్రభుత్వ నిర్లక్ష్యంతో అకాల వర్షాలకు రైతులు పూర్తిగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. మిల్లర్లు, పీఏసీఎస్, సివిల్ సప్లయి అధికారులు కుమ్మక్కై రైతులను నట్టేట ముంచుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే తరుగు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట జిల్లా అధ్యక్షులు అయిత ప్రకాష్‌రెడ్డి, నాయకులు, రైతులు ఉన్నారు.



రేగొండలో ధర్నా నిర్వహిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

సీసీ కెమెరాలతో భద్రం

టేకుమట్ల(గోరికొత్తపల్లి): గ్రామాల్లో సీసీ కెమెరాలతో గ్రామస్తులు భద్రంగా ఉండవచ్చని చిట్యాల సీఐ వేణుచందర్ అన్నారు. బుధవారం రేగొండ మండలంలోని గోరికొత్తపల్లిలో ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సీఐ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో 10 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, త్వరలోనే మరో 11 ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామాల్లోని కూడలిలో, రద్దీ ప్రాంతంలో, గ్రామ ప్రారంభం, చివరలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడంతో ఎవరైనా అనుమానిత వ్యక్తులు గ్రామంలోని వచ్చి అసాంఘిక కార్యక్రమాలు, చోరీలకు పాల్పడే వ్యక్తులను సులభంగా గుర్తించవచ్చన్నారు. ఇప్పటి వరకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రతి ఒక్కరూ సహకరించాలరని కోరారు. అందరి సహకారంతో త్వరలోనే మండలంలో మొత్తం 37 గ్రామ పంచాయతీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, నేరరహిత మండలంగా మార్చుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ రజిత, ఎంపీటీసీ హమీద్, వ్యాపారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



టేకుమట్ల : సీసీ కెమెరాలను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న సీఐ వేణుచందర్

మొగుళ్లపల్లి: సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడంతో గ్రామాల్లో నేరాలను నియంత్రించవచ్చని చిట్యాల సీఐ వేణుచందర్ అన్నారు. బుధవారం మండలంలోని అంకుషాపూర్‌లో గ్రామ ప్రజల సహకారంతో ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీధర్, సర్పంచ్ గాలి చంద్రమౌళి, ఉప సర్పంచ్, జీపీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

దబ్బగట్టులో పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

మల్హర్ : ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య ప్రణాళికలో భాగంగా మండలంలోని మల్లారం గ్రామపంచాయతీ పరిధిలోని దబ్బగట్టులో పంచాయతీ సిబ్బంది బుధవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బంది రోడ్డులను శుభ్రం చేసి, రోడ్లకిరువైపుల ఉన్న పిచ్చిమొక్కలను, పొదలను తొలగించారు. అలాగే ప్రభుత్వ భవనాలు పరిశుభ్రం చేయడం, నీరు నిల్వ ఉండే ప్రాంతాలను మొరంతో నింపారు. కార్యక్రమంలో కార్యదర్శి రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి

భూపాలపల్లి రూరల్ : ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా ఈనెల 4న వరంగల్‌లో జరిగే ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో జరిగే మహాసభను జిల్లాలోని అన్ని వర్గాలు ప్రజలు హాజరై విజయవంతం చేయాలని ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ అంబాల చంద్రమౌళి పిలుపునిచ్చారు. ఈ సభకు సంబంధించిన కరపత్రాలను అంబేద్కర్ సెంటర్‌లో పార్టీ కార్యకర్తలు బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు బట్టు విజయ్, గట్ల రాజన్న, బొల్లిబాబు, భిక్షపతి, కుమార్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు